క్లుప్తంగా

ఉచిత మెగా వైద్య శిబిరం

రౌతులపూడి: గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక శ్రీహర్ష ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో విశాఖ పట్నానికి చెందిన ఓమ్ని ఆసుపత్రి వైద్యులు కె.దామోదరరావు, జేపీ సృజన్, వై.గురు ప్రసాద్ ,డాక్టర్ ప్రియాంక, బి.హేమలత తదితరులు రోగులకు వైద్యసేవలు అందించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 700 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. వీరిలో 65 మందికి కంటిలో శుక్లాలు ఉన్నట్టు గుర్తించి శస్త్ర చికిత్స చేయించుకోవాలని సూచించారు. మరో 15 మందికి ఈసీజీ, తదితర పరీక్షలు నిర్వహించి గుండె శస్త్ర చికిత్సకు సూచించినట్లు నిర్వాహకులు జి.కృష్ణ తెలిపారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శంఖవరంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



శంఖవరంలో జేసీబీతో వ్యర్థాల తొలగింపు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ బందిలి గనియమ్మ అన్నారు. శంఖవరంలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సర్పంచ్ గనియమ్మ సూచించారు.

సిరిపురంలో నా భూమి-నా దేశం



సిరిపురంలో ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురం గ్రామంలో ఆదివారం నా భూమి-నా దేశం కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకూ మేరా మాటీ మేరా దేశ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అమర వీరులను స్మరించుకుంటూ ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరించి జిల్లా కేంద్రాలకు అక్కడ నుంచి ఢిల్లీకి తీసుకువెళ్లి ఢిల్లీలో అమృత వనం ఏర్పాటు చేస్తారన్నారు. అనంతరం పంచప్రాణ ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొల్లా శ్రీనివాస్, దాకే కృష్ణారావు, కురాకుల రాజా, ఏనుగు ధర్మరాజు, లోవరాజు, బండారు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన యువకుడి అరెస్టు

కొత్తపల్లి: ఆలయాల్లో చోరీకి పాల్పడిన యువకుడిని అరెస్టు చేసినట్లు స్థానిక పోలీసులు ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన ద్వారం రవిప్రసాద్ మండలంలోని శ్రీరాంపురం కనకదుర్గాదేవి ఆలయంలో మార్చి నెలలో చోరీకి పాల్పడ్డాడు. ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గతంలో రవికుమార్ కిర్లంపూడి, గొల్లప్రోలు, ప్రతిపాడు, ఏలేశ్వరం మండలాల్లోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి తీగలు, ఆయిల్ దొంగలించడంపై ఏడు కేసులు నమోదయ్యాయి. గొల్లప్రోలు, ప్రత్తిపాడు పరిసర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో కూడా చోరీకి పాల్పడ్డాడు. కాగా ఆదివారం ప్రత్తిపాడు వై జంక్షన్ వద్ద రవిప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి సుమారు రూ.లక్ష విలువ చేసే రాగి తీగలు, ఆయిల్‌తో పాటు పలు ఆలయాల్లో దొంగిలించిన ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

చవితికి మట్టి గణపతిని ప్రతిష్ఠించాలి

బోట్‌క్లబ్: వినాయక చవితి సందర్భంగా ప్రతీ ఇంటిలోను నవరాత్రి ఉత్సవాలకు మట్టి గణపతిని ప్రతిష్ఠించి పర్యావరణాన్ని రక్షించాలని భోగిగణపతి పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు అన్నారు. శ్రావణ హేరంభ సంకష్టహర చతుర్థి సందర్భంగా ఆదివారం సూర్యారావుపేటలోని భోగిగణపతి పీఠంలో సహస్ర నామ పారాయణ నిర్వహించారు. ఉపవాస ఆరాధనతో ఆరోగ్య ఆధ్యాత్మిక సంపద కలుగుతుందన్నారు. అనంతరం మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్ !

- గోకవరం తాణా సెంటర్‌లో వంతెన నిర్మాణం
- ఇటీవల శంకుస్థాపన చేసిన ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే చంటిబాబు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



గోకవరం రాణా సెంటర్‌లో ఊర కాలువపై శిథిలావస్థలో ఉన్న వంతెన



నూతన వంతెన నిర్మాణంలో భాగంగా రహదారికి ఇరువైపులా తొలగించిన చెట్లు

గోకవరం: మండల కేంద్రమైన గోకవరంలో ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ట్రాఫిక్ సమస్యకు మూల కారణమైన స్థానిక తాణాసెంటర్‌లో బ్రిటిషు కాలం నాటి ఇరుకు వంతెన స్థానంలో నూతనంగా వంతెన నిర్మిస్తున్నారు. జాతీయ రహదారి 516-ఇ నిర్మాణంలో భాగంగా వంతెన నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరయ్యాయి. దీంతో ఇటీవల కాకినాడ ఎంపీ వంగా గీత, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు నూతన వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

దశాబ్దాల సమస్యకు పరిష్కారం

ఈ వంతెన నిర్మాణం పూర్తయితే దశాబ్దాల కాలంగా నెలకొన్న సమస్య పరిష్కారం కానుంది. ఏజెన్సీకి ముఖద్వారమైన గోకవరం తాణా సెంటర్లో ఊర కాలువపై ఉన్న వంతెనను సుమారు 100 సంవత్సరాల క్రితం బ్రిటిషు కాలంలో నిర్మించారు. రెండు దశాబ్దాల క్రితమే ఈ వంతెన శిథిలావస్థకు చేరింది. నిత్యం ఈ వంతెనపై రాజమహేంద్రవరం నుంచి తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు వందల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెన ఇరుకుగా ఉండటం, వంతెనకు ఇరువైపులా మలుపులు ఉండటంతో భారీ వాహనాలు వంతెనపై ఇరుక్కుపోయి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రతీరోజూ ఉదయం, సాయంత్రం ఈ సమస్య సర్వసాధారణంగా మారిపోవడంతో ప్రయాణికులు నిత్యం తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ ఇరుకు వంతెనపై అనేక ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాతపడ్డారు.

8 ఏళ్ల క్రితమే పతిపాదనలు

ఈ వంతెన స్థానంలో నూతనంగా వంతెన నిర్మించడానికి ఎనిమిదేళ్ల క్రితమే ఆర్ అండ్ బీ అధికారులు రూ.కోటి వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లు ఆహ్వానించారు. ఆ నిధులతో వంతెన నిర్మాణం పూర్తికాదంటూ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో వంతెన నిర్మాణం జరగలేదు. ప్రస్తుతం రాజమహేంద్రవరం నుంచి ఏజెన్సీ మీదుగా విజయనగరం జిల్లాకు 516-ఇ జాతీయ రహదారి నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతుండటంతో గోకవరంలో తాణా సెంటర్ వంతెన నిర్మాణానికి మోక్షం లభించింది. త్వరలోనే వంతెన నిర్మాణం పూర్తయ్యి ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

16 మీటర్ల వెడల్పుతో నూతన వంతెన

జాతీయ రహదారి 516-ఇ నిర్మాణంలో భాగంగా గోకవరం తాణా సెంటర్‌లో నూతనంగా వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకున్నాం. టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది. వంతెన నిర్మాణంలో భాగంగా రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లు తొలగిస్తున్నాం. భూ సేకరణ ప్రక్రియ నడుస్తోంది. నూతన వంతెనను 16 మీటర్ల వెడల్పు, 18 మీటర్ల పొడవుతో నిర్మించనున్నాం. త్వరలోనే వంతెన నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

– శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ శాఖ జేఈ

6న జాబ్‌మేళా

తుని రూరల్: వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 6న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫైజర్ హెల్త్‌కేర్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళాను ఏర్పాటు చేశామన్నారు. ఎంపికైన అభ్యర్థులు అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. 2022, 2023 సంవత్సరాల్లో ఎంపీసీ, బైపీసీలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థినులు, ఇప్పుడు డిగ్రీ మొదట సంవత్సరం చదువుతున్న 18 నుంచి 20 సంవత్సరాల లోపు వయస్సు గల విద్యార్థినులు (మహిళలు) మాత్రమే అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.12,500 జీతం, భోజనం, వసతి, రవాణా సౌకర్యాలతో పాటు డిగ్రీ చదువుకునే అవకాశం కల్పిస్తున్నట్టు ఆమె తెలిపారు. తుని పరిసర ప్రాంతాల విద్యార్థినులు (మహిళలు) ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలను 89191 82007 నంబరును సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ గ్రామ సభలు

గండేపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై సోమవారం నుంచి సామాజిక తనిఖీ సభలు నిర్వహించనున్నట్టు ఉపాధి ఏపీఓ ఎన్.గంగాభవాని ఆదివారం తెలిపారు. గ్రామాల్లో 2022-23లో ఉపాధి హామీ పథకంలో చేసిన కాలువలు, చెరువులు, భవనాలు, సీసీ రోడ్లు, తదితర పనులపై తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ఉపాధి సిబ్బంది, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

వాటర్ ప్యూరిఫికేషన్ యూనిట్ల ఏర్పాటుకు స్థలపరిశీలన



దివీస్ ప్రతినిధులకు వినతిపత్రం అందిస్తున్న ఈఓ విశ్వనాథరాజు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో దివీస్ కంపెనీ సౌజన్యంతో తాగునీటి శుద్ధి యంత్రాలు (వాటర్ ప్యూరిఫికేషన్ యూనిట్లు) ఏర్పాటుకు స్థలాలను పరిశీలించినట్టు ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఆదివారం లోవదేవస్థానికి వచ్చిన దివీస్ ప్రతినిధులకు ఈఓ సాదర స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించిన అనంతరం భక్తుల సౌకర్యార్థం వాటర్ ప్యూరిఫికేషన్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ఈఓ వారికి వినతి పత్రం అందజేశారు. వాటర్ ప్యూరిఫికేషన్ యూనిట్లు ఏర్పాటు చేసే స్థలాలను దివీస్ ప్రతినిధులకు వివరించారు. యూనిట్లు ఏర్పాటుకు దివీస్ ప్రతినిధులు సుముఖత వ్యక్తం చేసినట్టు ఈఓ వివరించారు.

పాస్టర్ కుటుంబానికి ఆర్థిక సాయం



ఏవీ నగరంలో మృతుడు జాన్‌పాల్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న రాణి

తొండంగి: జాతీయ రహదారిపై మండలంలోని బెండపూడి తమ్మయ్యపేట వద్ద బైకులు దగ్ధమైన ఘటనలో మృతి చెందిన పాస్టర్ జాన్‌పాల్ కుటుంబానికి విశాఖపట్నం జిల్లా గాజువాకకు చెందిన అంగిన డానీ ఆదివారం ఆర్థిక సహాయం అందించారు. ఈ మేరకు ఏవీ నగరంలో జాన్‌పాల్ భార్య కుమారికి దాత డానీ భార్య రాణి రూ.15 వేల చెక్కును అందజేశారు. అగ్ని ప్రమాదంలో జాన్‌పాల్ మృతి చెందడంపై విచారం వ్యక్తం చేశారు.

సత్యదేవుని దర్శించిన డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడికి సత్యదేవుని చిత్రపటం అందిస్తున్న ఈఓ చంద్రశేఖర్ అజాద్

అన్నవరం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి చిత్రపటం , ప్రసాదాలను ఈఓ చంద్రశేఖర్ అజాద్ అందజేశారు. దేవస్థానంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు, నిర్మాణాల గురించి ఈఓ ఆయనకు వివరించారు. డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు వెంట శంఖవరం ఆర్వి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లిన కారు



డివైడర్‌పైకి దూసుకుపోయిన కారును పరిశీలిస్తున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది



ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డ ప్రయాణికులను పరామర్శిస్తున్న హైవే సిబ్బంది

గండేపల్లి: జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఘటనలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే... నర్సీపట్నం వద్ద గిడుతూరుకు చెందిన డి.అప్పారావు, భార్య శివకుమారి, బంధువు సచిన్‌తో కలిసి కారులో రాజమహేంద్రవరం తిరుమల కళాశాలలో 8వ తరగతి చదువుతున్న కుమారుడు దివాకర్‌ను చూసేందుకు వెళుతున్నారు. మండలంలోని గండేపల్లి శివారు హోటల్ సమీపంలోకి వచ్చే సరికి కారు డ్రైవ్ చేస్తున్న అప్పారావుకు కునుకుపాటు రావడంతో కారు అదుపుతప్పి రోడ్డుకు మధ్యలో ఉన్న డివైడర్‌పైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కారు దెబ్బతింది. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదస్థలం వద్దకు చేరుకున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది కుమార్, సతీష్ తదితరులు కారును పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రయాణికులు మరో కారులో నర్సీపట్నం వెళ్లిపోయారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



ఫ్యాకల్టీలను సత్కరించిన పంచాయతీ కార్యదర్శులు

సామర్లకోట: పంచాయతీ కార్యదర్శులకు ఆరు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ ఆదివారంతో ముగిసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని గ్రేడ్-1, గ్రేడ్ 5 కార్యదర్శులకు ఆరు రోజుల పాటు నిర్వహించే రెసిడెన్షియల్ ముగింపు శిక్షణలో విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ పాల్గొన్నారు. గ్రామాల్లో కొత్తగా లే అవుట్ల ఏర్పాటులో అమలులో ఉన్న నిబంధనలపై కార్యదర్శులకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ పరిధిలో కొత్త లే అవుట్ ఏర్పాటు, పరిపాలన విధానం, హక్కులు, బాధ్యతలు, పంచాయతీ చట్టం, ఉపాధి హామీ పనులు, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, క్షేత్ర స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, ఉద్యోగుల విధి నిర్వహణకు సంబంధించి క్రమశిక్షణ చర్యలపై శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో శిక్షణపై కార్యదర్శుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఫ్యాకల్టీలు బి.ఆంజనేయులు, ఎస్‌కె మోహిద్దీన్, శ్రీదేవి నిహారిక పాల్గొన్నారు. తమకు తెలియని అనేక విషయాలను తెలియజేశారని పంచాయతీ కార్యదర్శులు ఈటీసీ ఫ్యాకల్టీలను సత్కరించారు.

విజిలెన్స్ కమిటీ సభ్యురాలిగా జెడ్పీటీసీ బిందుమాధవి



జెడ్పీటీసీ బిందుమాధవికి అభినందనలు తెలుపుతున్న ఒమ్మి రఘురాం

జగ్గంపేట: జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందుమాధవికి విజిలెన్స్ (జిల్లా స్థాయి సివిల్ సప్లయిస్) కమిటీలో మెంబర్‌షిప్ లభించినట్టు వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారన్నారు. జెడ్పీటీసీ బిందుమాధవిని ఈ కమిటీలో మెంబర్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా బిందుమాధవి కలెక్టర్, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు బిందుమాధవికి అభినందనలు తెలిపారు.

తీరంలో పర్యాటకుల సందడి



పర్యాటకులతో సందడిగా మారిన ఉప్పాడ సాగర తీరం

కొత్తపల్లి: ఉప్పాడ సాగరతీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. పర్యాటకుల ఆటల పాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. ఉదయం లోవలోని తలుపులమ్మతల్లిని దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నానికి సాగర తీరానికి చేరుకున్నారు. కడలి కెరటాల్లో పిల్లలు, పెద్దలు కేరింతలు కొట్టారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్



తునిలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధికి రాఖీ కడుతున్న విజయ్‌ప్రకాష్

తుని: స్థానిక బ్యాంకు కాలనీ శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి, కాకినాడ జిల్లా సంఘ్ చాలక్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ సమాజంలో ఐక్యత, దేశభక్తి పెంపొందించడానికి రక్షాబంధన్ లాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. నేను మీకు రక్ష, మీరు నాకు రక్ష, మనమందరం దేశానికి, ధర్మానికి రక్ష అంటూ ఒకొరికొకరు రాఖీలు ధరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు కొడుకుల నాగభూషణం, గ్రామీణ వికాస్ ప్రముఖ్ చదరం నరసింగరావు, తుని ఖండ్ కార్యవాహ ప్రసాద్, వ్యవస్థ ప్రముఖ్ కుమార్, కుటుంబ ప్రమోదన్ కుందెం సత్యనారాయణ, కనుమూరి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

కాకినాడ సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా పోస్టులను భర్తీ చేయాలని సీపీఎం సమరభేరి డిమాండ్ చేసింది. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు సీపీఎం నిర్వహిస్తున్న సమరభేరిలో భాగంగా ఆదివారం సుందరయ్యభవన్‌లో నిరుద్యోగులతో నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక సంవత్సరానికి రూ. 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పినా యువశక్తి సక్రమంగా ఉపయోగించడం లేదన్నారు.

కాలిపుండు.. ప్రమాదం మెండు

- వర్షాకాలంలో మేకలు, గొర్రెలకు వ్యాపిస్తున్న కాలిపుండు వ్యాధి
- ముందుగా గుర్తించకుంటే పెను ప్రమాదం
- నియోజకవర్గంలో 68,712 మేకలు, గొర్రెలు



మేతకు వెళుతున్న మేకలు, గొర్రెలు

ప్రత్తిపాడు: వర్షాకాలం సీజన్ ఇది. ఇప్పటికే ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ సమయంలో మేకలు, గొర్రెల్లో కాలిపుండు వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని మండల పశువైద్యాధికారి, ధర్మవరం ప్రభుత్వ పశు వైద్యశాల వైద్యాధికారి సుంకర వరలక్ష్మి హెచ్చరిస్తున్నారు. పాడి రైతులు పశువుల ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

నియోజకవర్గంలో 34,640 మేకలు

నియోజకవర్గంలో 34,640 మేకలు, 34,072 గొర్రెలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మేతకు వెళ్లే మేకలు, గొర్రెల మందలు వర్షాకాలంలో తడవడం, మురికి గుంటలు, నిల్వ ఉన్న నీటిలో అధిక సమయం నిలిచి ఉండడం వల్ల సూక్ష్మ జీవులు వాటి కాళ్లను ఆశించడంతో వ్యాధి బారిన పడతాయి. పశువులు చిత్తడి నేలల్లో తిరగడం వల్ల కూడా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. దీనిని ముందుగా గుర్తించకుంటే ఒక మేకకు గానీ గొర్రెకు కానీ వచ్చిన వ్యాధి త్వరగా మందలోని మిగిలిన వాటికి వ్యాపిస్తుంది. ఈ సమస్యను అధిగమించేందుకు సంబంధిత కాపరులు పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

వ్యాధి లక్షణాలు ఇలా...

ఈ వ్యాధి సోకిన మేకలు, గొర్రెలు తొలుత నడకలో వెనుకబడతాయి. సరిగా నవడలేక ఇబ్బందులు పడతాయి. అలాంటప్పుడు వాటి గిట్టలను పరిశీలించాలి. గిట్టల మధ్య ఎర్రగా కందినట్లు ఉంటే కాలిపుండు వచ్చినట్లు గుర్తించాలి. ఈ వ్యాధి సోకిన జీవాలు సరిగా మేత మేయవు. బరువు తగ్గుతాయి. గిట్టల మధ్య ఎర్రగా కందిన భాగం ఉబ్బి చీము పడుతుంది. అలాగే తీవ్రమైన దుర్గాసన వస్తుంది. వ్యాధి తీవ్రతను బట్టి గిట్టలు ఊడిపోయే ప్రమాదం ఉంది.

చికిత్స ఇలా...

ఈ తరహా వ్యాధి లక్షణాలు మేకలు, గొర్రెల్లో గుర్తిస్తే తక్షణమే స్పందించాలి. వ్యాధి సోకిన గిట్టలను 10 శాతం కాపర్ సల్ఫేట్ లేదా జింకు సల్ఫేట్ ద్రావణంలో నడిపించి, వాటి కాళ్లను శుభ్రం చేయాలి. ఇలా రోజుకు రెండు సార్లు చేయడం వల్ల ఫలితం ఉంటుంది. వైద్యుల సూచనల మేరకు యాంటీ బయాటిక్ మందులను దాదాపు నెల వరకూ వాడాలి.

నియోజకవర్గంలో మేకలు, గొర్రెల వివరాలు

మండలం	మేకలు	గొర్రెలు	మొత్తం
ప్రత్తిపాడు	6,064	7,244	13,308
ఏలేశ్వరం	9,396	13,307	22,703
రౌతులపూడి	10,871	5,589	16,460
శంఖవరం	8,309	7,932	16,241
మొత్తం	34,640	34,072	68,712

పరిశుభ్రత కీలకం



మేకలు, గొర్రెల్లో కాలిపుండు వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండాలంటే వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరుచేయాలి. మందలను చిత్తడి, నీరు నిలిచే నేలలకు దూరంగా ఉంచాలి. మందను కాసే ప్రదేశాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఎప్పటికప్పుడు వైద్యుల సూచనల మేరకు మందులు వేయాలి. – సుంకర వరలక్ష్మి, మండల పశువైద్యాధికారి, ధర్మవరం

భారీ వర్షం



ఏలేశ్వరం చైతన్య కాలనీలో రహదారిపై నిలిచిన వర్షపు నీరు

ఏలేశ్వరం: మండల వ్యాప్తంగా ఆదివారం భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఉక్కబోతతో ఇబ్బందులు పడిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశంలో మేఘాలు కమ్ముకుని వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయయ్యాయి. రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం ఎండిపోతున్న ఖరీఫ్ పంటలకు ఊపిరిపోస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రత్తిపాడులో వర్షం

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎండ తీవ్రత కొనసాగింది. వేసవిని తలపించే తరహాలో ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం పడింది. ప్రజలు ఉపశమనం పొందారు. ఈ వర్షం ఖరీఫ్ పంటలకు ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు.